పాతబస్తీలో నేరాలకు అడ్డుకట్ట వేయాలి :రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, అక్కడ లా అండ్ ఆర్డర్ నిస్తేజంగా మారిపోయిందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. రాత్రి పూట పోలీసులు పెట్రోలింగ్ చేస్తుంటే వారిపై మజ్లిస్ ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఎంఐఎం విషయంలో స్పందించడంలేదన్నారు. పాతబస్తీలో నేరాలకు అడ్డుకట్టు వేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విధ్వంసకర ప్రాజెక్టును ఉపసంహరించాలి

- ఫార్మాసిటీని రద్దు చేసి మెగాసిటీని తేవద్దు : ప్రొ. దేసర్దా


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థికవేత్త ప్రొఫెసర్ హెచ్.ఎం దేసర్దా

పంజాగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీని రద్దు చేసి దాని స్థానంలో విధ్వంసకర ప్రాజెక్టును తీసుకురావటం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని మహారాష్ట్ర రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు, ఆర్థికవేత్త ప్రొఫెసర్ హెచ్.ఎం దేసర్దా డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ బాబు రావు, పర్యావరణవేత్త కవుల సరస్వతి, టి.శివప్రసాద్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. తాను రంగారెడ్డి జిల్లా యాచారం మండలం ఫార్మాసిటీ బాధిత గ్రామాల్లో వ్యవసాయం చేస్తూ, అనేక రకాల పంటలు పండిస్తున్నారని, పశుసంపద కూడా చాలా ఉందని తెలిపారు. ప్రస్తుతం మెగాసిటీ అని భూమి తీసుకుంటే సమస్య మళ్లీ మొదటికి వస్తుందన్నారు. ప్రకృతి సిద్ధంగా జరుగుతున్న వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థని ప్రోత్సహించాలని అన్నారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి


కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బంది

పంజాగుట్ట, జూన్27 (ఆంధ్రజ్యోతి): బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బందికి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కాంట్రాక్టు ఎంబీబీఎస్ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మూడు నెలలుగా జీతాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఐ.ఐ.హెచ్. ఎఫ్.డబ్ల్యూ) కార్యాలయంలో డీఎంహెచ్ఓలు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న బస్తీ దవాఖానా వైద్యులు, సిబ్బంది అక్కడికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు, వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా ఐదవ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రతినిధుల బృందం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

హర్షశ్రీకి ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు



హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని నంద్యాల ఎస్బీవోస్ కాలనీకి చెందిన తొమ్మండ్రు గురు హర్షశ్రీకి ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు లభించింది. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివిన ఆమె 991 మార్కులు సాధించి తెలంగాణలో మూడో ర్యాంకు సాధించారు. అయితే ఈ ఏడాది జరిగిన తెలంగాణ లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో 71వ ర్యాంకు సాధించిన హర్షశ్రీ.. తాజాగా ఏపీ లాసెట్‌లో 9వ ర్యాంకు సాధించారు. లా పూర్తిచేసిన తర్వాత జ్యుడీషియల్ సర్వీస్‌లో చేరడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

అరబిక్‌లో సయ్యిదా మర్యమ్ గజాలకు డాక్టరేట్

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో అరబిక్ భాషా శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సయ్యిదా మర్యమ్ గజాల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి అరబిక్‌లో డాక్టరేట్ పొందారు. హైదరాబాద్‌లోని గ్రంథాలయాల్లో ఉన్న 'హదీసు చేతిరాత ప్రతుల విశ్లేషణ' అంశంపై పరిశోధన చేసిన సయ్యిదా మర్యమ్ గజాల సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. కాగా, ఉస్మానియా అరబిక్ విభాగాధిపతిగా వ్యవహరిస్తున్న సీనియర్ ప్రొఫెసర్ సయ్యిదా తలత్ సుల్తానా ఆమెకు పర్యవేక్షకుడిగా వ్యవహరించారు.

సివిల్స్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచించారు. ఈ మేరకు తన కార్యాలయంలో క్రిష్ణప్రదీప్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ వాల్‌పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. అకాడమీ ఛైర్మన్ క్రిష్ణప్రదీప్ మాట్లాడుతూ యూపీఎస్సీ-2025లో నిర్వహిస్తున్న సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆప్షనల్ ఎంపికపై 7 రోజులపాటు ఉచిత తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైబరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్‌ల బదిలీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఐటీకారిడార్ ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఎస్.భరత్‌కుమార్‌ను సూరారాం పోలీస్‌స్టేషన్‌కు, కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ డి.కృష్ణమోహన్‌ను మాదాపూర్‌కు, మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లేశ్‌ను జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓగా, ఐటీసెల్ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి ముత్తును కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కె.క్యాస్ట్రోను రాజేంద్రనగర్ ఎస్‌హెచ్‌ఓగా, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్‌ను మైలార్‌దేవ్‌పల్లికి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.భూపాల్ శ్రీధర్‌ను చేవెళ్ల ఎస్‌హెచ్‌ఓగా, మేడ్చల్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహను షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ ఎం.లక్ష్మారెడ్డిని ఐటీ కారిడార్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌కు, శంకరపల్లి, మోకిల పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పనిచేస్తున్న ఆందోల్ నాగరాజును అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, జీడిమెట్ల డీఐగా పనిచేస్తున్న విజయ్‌నాయక్‌ను మాదాపూర్ డీఐగా, మాదాపూర్ డీఐ రమేష్‌నాయుడును చేవెళ్ల డీఐగా, మేడ్చల్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ కొచ్చర్ల రవిని అత్తాపూర్ డీఐగా, మైలార్‌దేవ్‌పల్లి డీఐగా పనిచేస్తున్న గొల్ల తిమ్మప్పను మేడ్చల్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.మధు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావులను సైబర్ క్రైం ఠాణాకు, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ బి.నాగేంద్రబాబును స్పెషల్ బ్రాంచ్‌కు, షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె. ప్రదీప్ లింగంను సీపీఓకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

'కాలిడోస్కోప్ 3.0'పై జాతీయస్థాయి సదస్సు


'కాలిడోస్కోప్ 3.0 సదస్సులో డాక్టర్ దిబ్యేందు ముజుందార్ రాకేష్‌మనోచా తదితరులు

అల్వాల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అకాడమీ ఆఫ్ కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ అండ్ ఎండోడొంటిక్స్(ఐఏసీడీఈ) సహకారంతో ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ, ఎండోడాంటిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం 'కాలిడోస్కోప్ 3.0' పై జాతీయస్థాయి సదస్సును నిర్వహించారు. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ) అధ్యక్షుడు డాక్టర్ దిబ్యేందు ముజుందార్ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సుకు దేశం నలుమూలల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు. జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ రాకేష్‌మనోచా, బ్రిగేడియర్ ప్రశాంత్ హలిగేరి, ఆర్మీ కాలేజ్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమతా కౌశిక్, డాక్టర్ దీపక్‌శర్మ, డాక్టర్ ఆర్ ఎస్ మోహన్‌కుమార్, డాక్టర్ గిరిష్ పర్మార్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎంపీ ఆర్. కృష్ణయ్య వినతి


రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య తదితరులు

రాంనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 20 నుంచి 42 శాతానికి పెంచాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గురువారం రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోరారు. కులాల వారీగా లెక్కలు సేకరించి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలన్నారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 21 శాతం నుంచి జనాభా ప్రకారం 50 శాతం పెంచాలన్నారు. క్రిమిలేయర్‌ను తొలగించాలన్నారు.

ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ప్రస్తుతం ప్రకటించిన 13 కార్పొరేషన్లకు తోడుగా మరో 40 కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ప్రస్తుతం ఉన్న 11 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలన్నారు. తమ డిమాండ్ల పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించి అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు గుజ్జ కృష్ణ, సత్యం, వేముల రామకృష్ణ, రాంకోటి, ఉదయ్, మణికంఠ పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రగతిపథంలో నడిపిన పీవీ


ప్రసంగిస్తున్న జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు, చిత్రంలో జనార్దనమూర్తి, తదితరులు

చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలతో సంక్షోభాన్ని నివారించి దేశాన్ని ప్రగతిపథంలో పీవీ నరసింహారావు నడిపారని మాజీ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో భాగంగా పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ మౌన ముద్రతోనే పలు సమస్యలను పరిష్కరించిన మేధావి పీవీ అని అన్నారు. బహుభాషా పండితులు అయినా తెలుగుదనం ఉట్టిపడేలా పంచకట్టుతో దేశాన్ని ఐదేళ్లపాటు నిరాటంకంగా నడిపించిన ఆయన గురుకుల విద్యాలయాలు, బడుగు బలహీనవర్గాలకు కమిషన్ ఏర్పాటు, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూ సంస్కరణలు వంటి విప్లవాత్మక నిర్ణయాల ఫలితాలు నేటికి అనుభవంలో ఉన్నాయని వివరించారు. ప్రముఖ గాయకులు చింతలపూడి త్రినాథరావు, శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, ప్రముఖ సంఘసేవకులు పబ్బ వైకుంఠం పాల్గొన్నారు.


రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ సంఘాల ప్రతినిధి బృందం

రౌడీలతో ప్రైవేటు కాలేజీల్లో డొనేషన్ల వసూళ్లు

- చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం నేతల డిమాండ్

కవాడిగూడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు బౌన్సర్ల పేరుతో రౌడీలను, గుండాలను పెట్టుకుని అక్రమంగా డొనేషన్లు వసూలు చేయడాన్ని అడ్డుకుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై బెదిరిస్తూ భౌతికంగా దాడులకు పాల్పడుతున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలను చట్టపరంగా శిక్షించి, బౌన్సర్లను నియమించుకున్న కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనగల శ్యామ్ కుర్మ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్‌లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

కార్యక్రమంలో నాయకులు పానుగంటి విజయ్, గుడూరు భాస్కర్, పాలకురు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


నీట్ అక్రమాలపై ఏఐవైఎఫ్ ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

నీట్, ఎన్‌టీఏలను రద్దు చేయాలి

- ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

బర్కత్‌పుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నీట్ ఎన్‌టీఏలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న బీజేపీ ఎంపీల ఇళ్ల ముట్టడించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ తెలిపారు. గురువారం విద్యార్థి యువజన సంఘాల ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రూపొందించిన హోర్డింగ్‌ను బల్మూర్ వెంకట్ ఆవిష్కరించి మాట్లాడారు. నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మూర్తి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి జావేద్, ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, పీవైఎల్ అధ్యక్షుడు కె.ఎస్. ప్రదీప్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటోలపై ప్రత్యేక డ్రైవ్

- నిబంధనలు పాటించని 621 మందిపై కేసులు నమోదు


స్కూల్ ఆటోలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్కూలు పిల్లలను తరలిస్తున్న ఆటోలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు 3.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్కూల్ ఆటోలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటో నడుపుతున్న 11 మంది, ఎక్కువ మంది స్కూలు పిల్లలను తరలిస్తున్న 95 మందిపై, ఒక మైనర్ ఆటోడ్రైవర్‌పై, ఫైలెట్ డ్రైవర్‌ను కలిగిఉన్న 57 మందిపై, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తున్న 40 మందిపై, యూనిఫాం ధరించని 406 మందిపై, డాక్యుమెంట్లు లేకుండా ఆటోలను నడుపుతున్న 11 మందిపై కేసులు నమోదు చేశారు. స్కూల్ ఆటోల్లో విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను తల్లిదండ్రులు, పాఠశాల నిర్వాహకులు గమనిస్తుండాలని అడిషనల్ సీపీ ట్రాఫిక్ పి.విశ్వప్రసాద్ తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులను ఆటోలో తరలించకుండా చూడాలని సూచించారు.

మోదీ ప్రభుత్వం నియంతృత్వ పద్ధతిని అవలంబిస్తోంది

- నీట్ ప్రశ్నాపత్రాల లీక్ ఘటనలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి
- సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాకూర్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాకూర్ తదితరులు

రాంనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో కొత్తగా ఏర్పడిన మోదీ ప్రభుత్వం పదేళ్ల పాలన మాదిరిగానే నియంతృత్వం నిరంకుశ పద్ధతినే అవలంబిస్తుందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాకూర్ ఆరోపించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీక్ ఘటనలో కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన నీట్ పరీక్ష సక్రమంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నీట్ ప్రశ్న పత్రాల లీకేజీలో కేంద్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆయన ఆరోపించారు. ఈ పరీక్షలో 24 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయగా 13 లక్షల మందికిపైగా పాసయ్యారని తెలిపారు. గుజరాత్, హరియాణా, మహారాష్ట్రలో పేపర్ లీకైన కేసు నమోదు కాకపోవడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేయాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-3, గ్రూప్-4 నోటిఫికేషన్లలో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ బాలిగ, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, కోశాధికారి వివేక్‌లు మాట్లాడారు. ప్రతి ఐదేళ్లకోసారి జంబో నోటిఫికేషన్ ఇచ్చి 5, 6 పోస్టులు ఇచ్చి నిరుద్యోగులను నిరాశపరుస్తున్నారని, టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ శిక్షణలో ఉత్తీర్ణత సాధించి పట్టాలు పొందిన లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బీటెట్‌లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి టైప్ ఇనిస్టిట్యూట్ నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. యాకత్‌పుర - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల నడుమ 45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.


సరోజారాయ్‌ను అభినందిస్తున్న సౌగంధి

యూఎస్ పీహెచ్‌డీ సాధించిన సరోజారాయ్

చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ డొమెనియన్ యూనివర్సిటీ (అమెరికా) కాలేజ్ ఆఫ్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకాలజీలో హ్యూమన్ ఫ్యాక్టర్స్ సైకాలజీలో పీహెచ్‌డీ సాధించిన క్లినికల్ సైకాలజిస్ట్ సరోజారాయ్‌ను గురువారం ప్రత్యేకంగా అభినందించారు. బెంగళూరులోని ఏవియేషన్ సైకాలజీ శాఖ క్రూ సైంటిస్ట్, ప్రొఫెసర్ హెడ్ సీహెచ్ ఎస్ సౌగంధి ఈ సందర్భంగా అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో గురువాం జరిగిన కార్యక్రమంలో సరోజారాయ్‌ను సన్మానించారు. సౌగంధి మాట్లాడుతూ యంగ్ క్లినికల్ సైకాలజిస్ట్ సరోజారాయ్‌కు అమెరికా యూనివర్శిటీలో పీహెచ్‌డీ రావడం అరుదైన విషయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్, ఆలిండియా సైకాలజిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డా. హిప్నో పద్మాకమలాకర్ తదితరులు పాల్గొన్నారు.


బ్రిడ్జి నిర్మాణ నమూనాను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు వివరిస్తున్న అధికారులు

మూసారాంబాగ్ బ్రిడ్జి పనుల పరిశీలన

అంబర్‌పేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలోని మూసారాంబాగ్ బ్రిడ్జి పై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమై 8 నెలలు గడచినా పనులు వేగంగా జరగడం లేదని ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యం కావడం ట్రాఫిక్ డైవర్షన్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి బ్రిడ్జి నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు సురేష్, రేణుక, ప్రశాంత్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీవినయ్

మహిళల ఆర్థిక బలోపేతానికి శిక్షణా కేంద్రాలు

- కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి స్వయం ఉపాధి శిక్షణా కేంద్రాలు చాలా అవసరమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని వీవీగిరినగర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, వీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణాకేంద్రంలో గురువారం మూడో బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమైంది. శిక్షణాకేంద్రాన్ని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలిసి కార్పొరేటర్ పావని సందర్శించి మాట్లాడారు కేంద్రంలో కావాల్సి సదుపాయాలు అందజేయడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. శిక్షణ పొందుతున్న మహిళలు, శిక్షణనిస్తున్న టీచర్ లలిత, బీజేపీ నేతలు విజయలక్ష్మి, సాయికుమార్, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలను పరిష్కరించాలి


వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న గోపి రజక

నల్లకుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఒకే వృత్తి చేస్తున్న ఏకైక కులం దోబీ వృత్తిదారులేనని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక ఆరోపించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి దోబీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన హైదర్‌గూడలో విలేకరులతో మాట్లాడుతూ రజకుల ఎస్సీలో చేర్చే అంశంపై రాష్ట్ర అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీలకు మంత్రి పదవుల్లో అన్యాయం

బర్కత్‌పుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు మంత్రి పదవుల కేటాయింపులో తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ ఆరోపించారు గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడచినప్పటికీ మున్నూరుకాపులకు మంత్రి పదవి కేటాయించలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు మంత్రి పదవి కేటాయించి మున్నూరుకాపులను గుర్తించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నామినేటెడ్ పోస్టుల్లో మున్నూరుకాపులకు అధిక ప్రాధాన్యవ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మణికంఠ, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ డయల్ యువర్ డీఎం

బర్కత్‌పుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సూచనలు, సలహాలకై ఈ నెల 28న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం. వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని ప్రయాణికులు 9000406069 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.


విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించండి

- విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని, గురుకులాల్లోనూ ప్రత్యేక కోటా ఇవ్వాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రైవేటు, కార్పోరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. స్పందించిన వెంకటేశం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జర్నలిస్టులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సోమయ్య, బసవపున్నయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ్, జగదీశ్వర్, రామకృష్ణ, రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.



హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హెలెన్ కెల్లర్ 144వ జయంతి సందర్భంగా 'దివ్యాంగుల విద్య-స్థితిగతులు-ప్రభుత్వం పాత్ర' పై ఏర్పాటు చేసిన సెమినార్‌లో వెంకట్‌రావు, నాగేందర్, ఉమర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.